# జనరల్ సైన్స్

## భారత దేశంలో పర్యావరణ ఉద్యమాలు

**భారతదేశంలో అనేక పర్యావరణ ఉద్యమాలు జరిగాయి. గిరిజనుల జీవనాధారాన్ని రక్షించడానికి, జలవనరుల కాలుష్యాన్ని నివారించడానికి ఈ ఉద్యమాలు పాటుపడ్డాయి. ఇవి ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటును వ్యతిరేకించాయి. అంతేకాకుండా అణుశక్తి ప్రాజెక్ట్‌ల దుష్ప్రభావాలను నిరోధించడానికి పోరాడాయి. వీటిలో ముఖ్యమైన ఉద్యమాల గురించి తెలుసుకుందాం.**

### బీస్ - నౌ ఉద్యమం

శ్రీ జంబేశ్వర్ అనే మతగురువు సూచించిన '29 సూత్రాల' ఆధారంగా ఈ ఉద్యమం (బీస్ = ఇరవై; నౌ = తొమ్మిది) రూపొందింది. అందుకే దీనికి బీస్ నౌ ఉద్యమం అనే పేరు వచ్చింది.

★ దాదాపు 550 సంవత్సరాలకు ముందు ఒక మత సంబంధ సంస్థ పశ్చిమ థార్ ఎడారి ప్రాంతాల్లో (నేటి పంజాబ్, సింధ్ ప్రాంతాలు) దీన్ని ప్రారంభించింది.

★ వన్యప్రాణుల (వృక్ష, జంతు జాతులు) సంరక్షణ ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడటం, పర్యావరణ అనుకూల సామాజిక జీవనాన్ని వ్యవస్థలో నెలకొల్పడం ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశం.

★ జంబేశ్వర్ ప్రతిపాదించిన 29 సూత్రాల్లో 10 ఆరోగ్య పరిరక్షణకు, 7 సామాజిక ప్రవర్తన మెరుగుపరచడానికి, 5 దైవభక్తిని ప్రబోధించడానికి, మిగిలిన 7 జీవవైవిధ్య పరిరక్షణ, పశుసంవర్ధకతను పెంచడానికి సంబంధించినవి.

★ బీస్-నౌ ఉద్యమం అమృతాదేవి నాయకత్వంలో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా కొనసాగింది. ఈ ఉద్యమమే తర్వాతి కాలంలో బిష్ణోయ్ ఉద్యమ రూపాన్ని సంతరించుకుంది

### బిష్ణోయ్ ఉద్యమం

బిష్ణోయ్ ఉద్యమం 1730 లో జరిగింది. భారతదేశంలో తొలి పర్యావరణ ఉద్యమం లేదా మొదటి చిప్కో ఉద్యమంగా దీన్ని పేర్కొంటారు.

★ రాజస్థాన్‌కు చెందిన అమృతాదేవి నాయకత్వంలో ఖేజ్రీ వృక్షాల రక్షణ కోసం బిష్ణోయ్ ఉద్యమం ప్రారంభమైంది. బిష్ణోయ్ జాతి ప్రజలు ఆరాధించే ఖేజ్రీ వృక్షాల నరికివేతను వ్యతిరేకించడమే ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశం.

★ మర్వాడ్ పాలకుడైన అభయ్‌సింగ్ బిష్ణోయ్ గ్రామాల్లో చెట్లను నరికివేయడంపై నిషేధం విధించడానికి ఈ ఉద్యమం దోహదపడింది.

### జంగిల్ బచావో ఆందోళన

బిహార్ ప్రభుత్వం సహజసిద్ధ అడవుల్లో పెరిగే సాల్ చెట్లను తొలగించి, వాటిస్థానంలో ఖరీదైన టేకు చెట్లను పెంచాలని నిర్ణయించింది. 1982 లో సింగ్‌భమ్ జిల్లాలో ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా జంగిల్ బచావో పేరుతో ఆందోళన మొదలైంది. ఆ తర్వాత జంగిల్ బచావో ఉద్యమం ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలకు కూడా విస్తరించింది.

### సేవ్ సైలెంట్ వ్యాలీ ఉద్యమం

కేరళ ప్రభుత్వం సైలెంట్ వ్యాలీలోని కుంతీపూజ నదిపై హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్‌ను (జలవిద్యుత్ ప్రాజెక్ట్) నిర్మించాలని నిర్ణయించింది. 1978 లో రోములస్ విటేకర్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా సేవ్ సైలెంట్ వ్యాలీ ఉద్యమం ప్రారంభమైంది.

★ అనేక స్థానిక వన్యప్రాణులు, సతతహరిత అరణ్యాలను కలిగిన సైలెంట్ వ్యాలీ బయోస్ఫియర్ (పర్యావరణ హాట్‌స్పాట్) తన సహజత్వాన్ని కోల్పోకుండా కాపాడటమే దీని ప్రధాన ఉద్దేశం.

★ ఈ ఉద్యమ నేపథ్యంలో జలవిద్యుత్ ప్రాజెక్ట్‌పై రివ్యూ కోసం ప్రభుత్వం ఎం.జి.కె. మీనన్ కమిటీని నియమించింది. కుంతీపూజ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రద్దు చేయాలని మీనన్ కమిటీ తన నివేదికలో సూచించింది.

★ దీంతో సేవ్ సైలెంట్ వ్యాలీ ఉద్యమం ఆగిపోయింది. కానీ ఈ ఉద్యమ విజయం ఆ తర్వాతి కాలంలో జరిగిన నర్మదా బచావో, తెహ్రీ డ్యాం వ్యతిరేక ఆందోళనలకు మార్గదర్శకమైంది. సైలెంట్ వ్యాలీని 1985 లో సైలెంట్ వ్యాలీ నేషనల్ పార్క్‌గా ప్రకటించారు.



www.eenadupratibha.net

## అప్పికో ఉద్యమం

చిప్కో ఉద్యమ విజయ ప్రేరణతో అప్పికో ఉద్యమం ప్రారంభమైంది. అటవీశాఖకు చెందిన ప్రైవేటు కాంట్రాక్టర్ల నుంచి వృక్ష సంపద, అటవీ వనరులను కాపాడటం ఉద్యమ ప్రధాన ఉద్దేశం.

★ 1983 లో కర్ణాటకలోని ఉత్తర కనరా జిల్లాలో కలాసే అడవిలో పాండురంగ హెగ్డే అనే వ్యక్తి ఈ అప్పికో ఉద్యమాన్ని ప్రారంభించారు. అప్పికో అంటే కన్నడ భాషలో (చెట్లను నరికి వేయకుండా) ఆలింగనం చేసుకుని, అడ్డుకోవడం అని అర్థం.

★ ఈ ఉద్యమం నిరాటంకంగా 38 రోజుల పాటు జరగడంతో, ప్రభుత్వం చెట్లను కొట్టే కార్యక్రమాన్ని విరమించుకుంది.

## నర్మదా బచావో ఆందోళన

గుజరాత్‌లోని నర్మదా నదిపై వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైంది. వీటివల్ల కలిగే నష్టాలకు వ్యతిరేకంగా ఆదివాసులు, రైతులు, పర్యావరణవాదులు, మానవహక్కుల పరిరక్షణ కార్యకర్తలు ఈ ఉద్యమాన్ని చేపట్టారు.

★ ఈ ఉద్యమం 1985 లో మేధా పాట్కర్ నాయకత్వంలో ప్రారంభమైంది.

★ ఈ ఉద్యమ కాలంలో జరిగిన అనేక నిరాహార దీక్షలు, ర్యాలీలు, నిరసనల కారణంగా ఈ ప్రాజెక్టులకు రుణం ఇచ్చేందుకు అంగీకరించిన ప్రపంచ బ్యాంకు ఆ హామీని విరమించుకుంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోయింది.

★ ఈ ఉద్యమం పర్యావరణ పరిరక్షణ, పునరావాసం, ఉపశమన విధానాలు లాంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించింది.

## ఝార్ఖండ్ జంగిల్ బచావో ఆందోళన

ఇది ఒక ఆదివాసి తెగల ఉద్యమం. జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణ, పోడు వ్యవసాయం కోసం ఆదివాసులే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని చేపట్టారు.

★ ఈ ఉద్యమ తీవ్రతను గుర్తించిన భారత ప్రభుత్వం 2006 లో అటవీ హక్కుల చట్టాన్ని రూపొందించింది.

★ ఈ చట్టం ప్రకారం అటవీ ఉత్పత్తులపై గిరిజనులకు హక్కులు కల్పించారు. అటవీ వనరులపై వ్యవస్థాపరమైన యాజమాన్యానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.

## కైగా అణువిద్యుత్ కేంద్ర వివాదం

కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, కైగాలో కాళినది వద్ద నెలకొల్పిన కైగా అణువిద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్ నిర్మాణానికి అనుసరించిన విధానం వివాదాస్పదమైంది.

★ ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ప్రకటించిన భద్రతా వలయం (నిషేధ ప్రాంతం) విస్తీర్ణం గురించి ప్రాజెక్ట్ అధికారులు, తిరుగుబాటుదారుల మధ్య వివాదం మొదలైంది.

★ 2012 లో ఉద్యమ కార్యకర్తల కమిటీ ప్రభుత్వం భూమిని సరైన ధరకు సేకరించాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఒక ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేసింది.

## గంగా సంరక్షణ ఉద్యమం

గంగా నది స్వచ్ఛత, పవిత్రతను కాపాడటానికి అనేకమంది సాధువులు, కార్యకర్తలు (ఉత్తర్ ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో) నడిపిన అతి పెద్ద అహింసావాద ఉద్యమం ఇది.

మన ప్రకృతి వ్యవస్థను, ముఖ్యంగా పవిత్ర గంగా, హిమాలయ ప్రాంతాల పర్యావరణ మైత్రి, సంస్కృతిని కాపాడటం, అహింసా మార్గంలో ప్రజలందరికీ అవగాహన కల్పించడం ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం.

★ ఈ ఉద్యమ ఫలితంగా 1986 ఏప్రిల్‌లో ప్రధానమంత్రి 'గంగా కార్యాచరణ ప్రణాళిక'ను ప్రకటించారు. ఈ ప్రణాళిక గంగ, దాని ఉపనదుల కాలుష్య నివారణలో విఫలమైంది.

★ గంగ, దాని ఉపనదుల కాలుష్యానికి వ్యతిరేకంగా జాతీయ మహిళా సమాఖ్య స్థాపకురాలు రమారౌత్ర 1998 లో గంగా సంరక్షణ ఉద్యమాన్ని కొనసాగించారు.

## సింగూరు - టాటా నానో ఫ్యాక్టరీ వివాదం

పశ్చిమ్ బంగలోని హుగ్లీ జిల్లా సింగూరులో 997 ఎకరాల స్థలంలో కార్ల తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం టాటా కంపెనీకి అనుమతి ఇచ్చింది. 2006 డిసెంబరు 1 న ఈ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేపట్టడంతో వివాదం మొదలైంది.

★ అప్పట్లో పశ్చిమ్ బంగలో తృణమూల్ పార్టీ ప్రతిపక్ష స్థానంలో ఉంది. ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ప్రకటించిన 'వ్యవసాయ భూమి పరిరక్షణ' నినాదంతో ఈ ఉద్యమం బలోపేతమైంది.

★ ఈ ఉద్యమానికి పర్యావరణవాదులైన మేధా పాట్కర్, అనురాధ తల్వార్, అరుంధతీరాయ్‌తోపాటు అనేకమంది మేధావులు మద్దతు పలికారు. ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకుంది.

## కూడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్ట్ వివాదం

తమిళనాడులోని కూడంకుళం వద్ద చేపట్టిన అణువిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం ఈ ఉద్యమానికి కారణమైంది. ఈ అణువిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అక్కడి మత్స్యకారుల జీవనోపాధి కోల్పోవడం, రేడియోధార్మిక విషవాయువులు స్థానికుల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని తేలడం ఆందోళనకు దారితీసింది.

## చిప్కో ఉద్యమం

ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో అడవుల నరికివేతకు వ్యతిరేకంగా 1964 లో దశోలి గ్రామ స్వరాజ్ మండల్ అనే సంస్థ రూపొందింది. ఈ సంస్థ ఏర్పాటు చిప్కో ఉద్యమానికి పునాదిగా చెప్పవచ్చు.

★ చిప్కో అంటే హిందీలో చెట్లను నరికివేయకుండా కౌగిలించుకోవడం లేదా ఆలింగనం చేసుకోవడం ద్వారా ప్రతిఘటించడం అని అర్థం.

★ ఈ ఉద్యమం 1973 లో సుందర్‌లాల్ బహుగుణ సారథ్యంలో నాటి ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని (నేటి ఉత్తరాఖండ్) హిమాలయ ప్రాంతంలో ప్రారంభమైంది.

★ చిప్కో ఉద్యమం ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని తొలిసారిగా కలిగించింది. అంతేకాకుండా ఆ తర్వాత వచ్చిన అనేక పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచింది.

★ ఈ ఉద్యమంలో సరళా బెహన్, మీరా బెహన్, గోపేశ్వర్, సుందర్‌లాల్ బహుగుణ, చండీప్రసాద్ భట్ మొదలైనవారు పాల్గొన్నారు.

★ ఉత్తర్ ప్రదేశ్‌లో కొనసాగిన ఈ ఉద్యమం 1980 నాటికి విజయం సాధించింది. హిమాలయ అడవుల్లో చెట్ల నరికివేత నిషేధం, సహజవనరుల విధానం రూపకల్పనకు ఈ ఉద్యమం దోహదపడింది.

## మాదిరి ప్రశ్నలు

**1.** శ్రీ జంబేశ్వర్ మతగురువు సూచించిన 29 సూత్రాల ఆధారంగా రూపొందిన పర్యావరణ ఉద్యమం ఏది?

1) అవతార్ ఉద్యమం  2) బీస్-నౌ ఉద్యమం  3) బిష్ణోయ్ ఉద్యమం  4) అప్పికో చలువారి

**2.** కిందివాటిలో సైలెంట్ వ్యాలీ ఉద్యమానికి సంబంధించి సరైన కారణం ఏమిటి?

1) కార్ల ఫ్యాక్టరీ నిర్మాణం

2) రసాయన కర్మాగార నిర్మాణం

3) క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటు

4) కుంతీపూజ నదిపై హైడ్రో ఎలక్ట్రిక్ రిజర్వాయర్ నిర్మాణం

**3.** చిప్కో ఉద్యమం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?

1) 1970  2) 1971  3) 1972  4) 1973

**4.** బిష్ణోయ్ జాతి ప్రజలు ఆరాధించే 'ఖేజ్రీ' వృక్షాల నరికివేతకు వ్యతిరేకంగా జరిగిన బిష్ణోయ్ ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?

1) సుందర్‌లాల్ బహుగుణ  2) మేధా పాట్కర్  3) అమృతాదేవి  4) రోములస్ విటేకర్

**5.** కిందివాటిలో సరైన జత ఏది?

1) సైలెంట్ వ్యాలీ ఉద్యమం - రోములస్ విటేకర్  2) అప్పికో ఉద్యమం - పాండురంగ హెగ్డే

3) నర్మదా బచావో ఆందోళన - మేధా పాట్కర్  4) పైవన్నీ సరైనవి

www.eenadupratibha.net

**6.** పశ్చిమ్ బంగలో టాటా కార్ల ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మమతా బెనర్జీ ఇచ్చిన నినాదం ఏమిటి?

1) అటవీ పరిరక్షణ
2) వ్యవసాయ భూమి పరిరక్షణ
3) మత్స్య సంపద పరిరక్షణ
4) ఏదీకాదు

**7.** 'నవధాన్య ఆందోళన' ఉద్యమాన్ని ప్రారంభించిన పర్యావరణవేత్త ఎవరు?

1) వందనాశివ
2) రాజేంద్రసింగ్
3) పాండురంగ హెగ్డే
4) అమృతాదేవి

**8.** 'ఖైగా' అణువిద్యుత్ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?

1) తమిళనాడు
2) రాజస్థాన్
3) కర్ణాటక
4) మహారాష్ట్ర

**9.** 'అప్పికో ఉద్యమం' ఏ రాష్ట్రంలో, ఎవరి సారథ్యంలో జరిగింది?

1) తమిళనాడు - పాండురంగ హెగ్డే
2) కర్ణాటక - పాండురంగ హెగ్డే
3) పశ్చిమ్ బంగ - మమతా బెనర్జీ
4) బిహార్ - అమృతాదేవి

**10.** రమారౌత్ర ఏ ఉద్యమానికి నాయకత్వం వహించారు?

1) గంగా సంరక్షణ ఉద్యమం
2) ఝార్ఖండ్ జంగిల్ బచావో ఉద్యమం
3) బలియాపాల్ ఉద్యమం
4) బిష్ణోయ్ ఉద్యమం

**జవాబులు**

**1-2; 2-4; 3-4; 4-3; 5-4; 6-2; 7-1; 8-3; 9-2; 10-1.**

**-పి. బాబా ఫక్రుద్దీన్**

www.eenadupratibha.net